క్లుప్తంగా

వైభవంగా ముత్యాలమ్మ తీర్థం



ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహించిన కోలాటం

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి తీర్థం సోమవారం వైభవంగా జరిగింది. జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నవోదయలో మెరుగైన ఫలితాలు ప్రశంసనీయం



నవోదయ విద్యార్థుల సత్కార సభలో మాట్లాడుతున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: యానాం జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తూ మిగిలిన విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం మెట్టకూరులోని జవహర్ నవోదయ విద్యార్థులు సీబీఎస్‌ఈ బోర్డు పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి రీజియన్‌లో యానాం నవోదయ విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఈ పరంపరను కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను అభినందించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

ఐ.పోలవరం: గత టీడీపీ హయాంలో జరిగిన ఎంఆర్‌పీఎస్ కురుక్షేత్ర సభలో విద్యార్థులు, ఎంఆర్‌పీఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసే అంశంపై సానుకూల స్పందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా ఎంఆర్‌పీఎస్ కన్వీనర్ సవరపు భైరవమూర్తి మాదిగ కృతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం మురమళ్లలో ఆయన మాట్లాడుతూ అక్రమ కేసుల వల్ల విద్యార్థుల జీవితాలు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐ.పోలవరం మండల ఎంఆర్‌పీఎస్ కమిటీ అధ్యక్షుడు వీధి వెంకటేశ్వరావు, ఉందుర్తి కిషోర్, ముమ్మిడివరపు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



అల్లవరంలో శాంతి ర్యాలీ చేస్తున్న పాస్టర్లు

అల్లవరం: రెండు నెలలుగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా అల్లవరం మండల పాస్టర్ల పెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండలో సుమారు 250కి పైగా చర్చిలను నేలమట్టం చేశారన్నారు. వందలాది మంది క్రైస్తవులను చంపేస్తున్నా దేశ ప్రధాని నరేంద్రమోడీ మౌనంగా ఉన్నారన్నారు. క్రైస్తవులపై దాడులను అరికట్టాలని పాస్టర్లు నినాదాలు చేశారు. తొలుత మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకి వినతిపత్రం అందించి అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్, ఎస్‌ఐలకు వినతిపత్రాలిచ్చారు. కార్యక్రమంలో పాస్టర్ల పెలోషిప్ అధ్యక్షుడు సియోను రాజు, కార్యదర్శి నవీన్‌కుమార్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్‌రాజు, బెనర్జీ, ప్రకాష్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12వ పే కమిషన్‌ను ఏర్పాటుచేయాలి

అమలాపురం టౌన్: స్థానిక ఏవీఆర్ నగర్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ సమావేశంలో 12వ పే కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పారుపూడి కృష్ణ శాస్త్రి అధ్యక్షతన సోమవారం జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, కోశాధికారి జేఎస్ శర్మలు ప్రవేశపెట్టిన సాధారణ, ఆర్థిక నివేదికలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సాయివరప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు మండలిక ఆదినారాయణ, మెహబూబ్ షహీరా తదితరులు పాల్గొన్నారు.

వారపు సంత.. తీరని చింత

- తాళ్లరేవు వారపు సంత ప్రాంగణంలో సమస్యల నెలవు
- షెల్టర్లు లేక ఎండ, వానల నుంచి రక్షణ కరవు
- అవస్థలు పడుతున్న ప్రజలు, వ్యాపారులు



తాళ్లరేవులో రహదారికి ఇరువైపులా విక్రయాలు చేస్తున్న వ్యాపారులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు వారపు సంత ప్రాంగణంలో సమస్యలు నెలకొన్నట్లు ప్రజలు, వ్యాపారులు వాపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు కాయగూరలు, కిరాణా సరకులు, పండ్లు వంటి వాటిని కొనుగోలు చేసేందుకు ప్రతి సోమవారం తాళ్లరేవు వస్తుంటారు. అయితే వారపు సంతలో కనీస సౌకర్యాలు లేక అనేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా షెల్టర్‌లు లేకపోవడంతో ఎండ, వర్షాల నుంచి రక్షణ ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంత ప్రాంగణంలో షెల్టర్‌లు లేకపోవడంతో రహదారిపైనే వ్యాపారులు విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో సంతలోకి వచ్చే వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అదే విధంగా సంత రోజున వర్షం వస్తే ఇక అంతే సంగతులు. సరుకులు కొనుక్కునేందుకు వచ్చేవారికి తలదాచుకునేందుకు కూడా అవకాశం లేకపోవడంతో తడిసి ముద్దవుతున్నారు. అంతేకాకుండా ఎక్కడినీరు అక్కడే నిలిచిపోయి ప్రజలు, వ్యాపారులు పడే బాధలు అన్నీ ఇన్నీ కావు. వర్షం వస్తే తమ వ్యాపారాలు సాగడం లేదని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. సంత ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అలాగే విశాలమైన షెల్టర్‌లను నిర్మించాలని కోరుతున్నారు. అదేవిధంగా వర్షం నీరు నిలబడకుండా ఎప్పటికప్పుడు బయటకుపోయేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు



తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన వారంతా ప్రతి సోమవారం సంతకు వచ్చి వారానికి సరిపడే సరకులు, కాయగూరలు, పండ్లు ఇతర వస్తువులు కొనుక్కుని వెళ్లడం ఆనవాయితీ. కాని ఇక్కడ సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి సంతలో సౌకర్యాలు కల్పిస్తే మరింత అభివృద్ధి చెందుతుంది.

– జి.నూకరాజు, స్థానికుడు

షెల్టర్‌లు నిర్మించాలి



సంత ప్రాంగణంలో షెల్టర్‌లు లేకపోవడంతో టార్పాలిన్‌లు కట్టుకుని విక్రయాలు సాగించాల్సి వస్తుంది. కొంతమంది వ్యాపారులు రహదారిపైనే విక్రయాలు సాగించాల్సి వస్తుంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. అధికారులు స్పందించి షెల్టర్‌లు నిర్మించాలి.

– నందికోళ్ల సతీష్, కాయగూరల వ్యాపారి

సౌకర్యాలు కల్పించాలి



ఎన్నో ఏళ్లుగా ఇక్కడ వ్యాపారం చేస్తున్నాం. వేసవిలో ఎండను తట్టుకోలేక ఇబ్బందులు పడుతుంటే, వర్షాకాలం ముంపు బెడదతో అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి సంత ప్రాంగణాన్ని చదును చేయించి ముంపు బారిన పడకుండా చూడాలి. ఎండ, వానల నుంచి రక్షణ కోసం షెల్టర్ నిర్మించాలి.

– పెన్నాడ సత్యం, కిరాణా వ్యాపారి

అర్హులందరికీ న్యాయం చేసేందుకే సురక్ష



అమలాపురం జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి



జార్జిపేటలో మహిళకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

అమలాపురం టౌన్: వివిధ కారణాలతో సంక్షేమ పథకాలను పొందలేని అర్హులందరికీ న్యాయం చేసేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక 19, 20 వార్డులకు సంబంధించి ఏవీఆర్‌నగర్‌లోని వార్డు సచివాలయ వద్ద సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి చైర్‌పర్సన్ నాగేంద్రమణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్లు తిక్కా సత్య లక్ష్మి, చిక్కాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: జగనన్న సురక్ష ద్వారా సమకూరుతున్న తక్షణ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. సోమవారం జార్జిపేట పంచాయతీ నీలాద్రిపేటలో సర్పంచ్ పేర్ని ఆదినారాయణమూర్తి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 322 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: మండలంలోని కాట్రేనికోన-4, బ్రహ్మసమేథ్యం-1 సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ అర్హత ఉండి ప్రభుత్వ పథకాలకు దూరమైనవారికి జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. బ్రహ్మసమేథ్యంలో 605 మందికి, కాట్రేనికోనలో 407 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, సర్పంచ్ మల్లాడి ఏడుకొండలు, ఎంపీడీఓ వెంకటాచలం, డిప్యూటీ తహసీల్దార్ ఝూన్సీ, ఈఓపీఆర్డీ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పేరూరు పంచాయతీ పరిధిలోని మూడు సచివాలయాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుడిపూడి సత్యనారాయణ, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, ఈఓపీఆర్డీ జి.మల్లికార్జునరావు, ఎంపీటీసీ చొల్లంగి సబ్బిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం



ముమ్మిడివరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు



గోడిలో పవన్‌కల్యాణ్ ఫొటోలను దహనం చేస్తున్న వలంటీర్లు

- ముమ్మిడివరంలో నిరసన ర్యాలీ
- గోడిలో పవన్ ఫొటోల దహనం

ముమ్మిడివరం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా వలంటీర్లు నిరసన తెలియజేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట మండల, నగర పంచాయతీ పరిధిలోని వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవా దృక్పథంతో పనిచేస్తున్న తమపై రాజకీయ దురుద్దేశంతో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. పవన్‌కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అల్లవరం: ఏలూరులో జరిగిన వారాహి యాత్రలో వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా గోడిలోని వలంటీర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ ఫొటోలను దహనం చేశారు.

అమలాపురం రూరల్: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మిడిమిడి జ్ఞానంతో వలంటీర్ల కోసం మాట్లాడుతున్నారని వైసీపీ నాయకులు విమర్శించారు. వలంటీర్లను ఉద్దేశించి ఏలూరులో చేసిన వ్యాఖ్యలు సరైనవి కాదని జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, కామనగరువు వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజులపూడి మురళి కృష్ణ, నక్కా చంద్రశేఖర్, రాజులపూడి భాస్కరరావు ఆరోపించారు.

వలంటీర్లకు పవన్‌కల్యాణ్ క్షమాపణలు చెప్పాలి



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. గోడిలోని ఆయన నివాసంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పారదర్శకంగా అందజేసేందుకు ఏర్పాటుచేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను వలంటీర్లు అందిస్తున్నారన్నారు. నాలుగేళ్లుగా వలంటీర్ల సేవలను దేశవ్యాప్తంగా కీర్తిస్తుంటే పవన్‌కల్యాణ్‌కు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు బానిసలా వ్యవహరిస్తూ పవన్ తన ఉనికిని కోల్పోతున్నారన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- వన్నె చింతలపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో డాక్టర్ పినిపే శ్రీకాంత్

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వన్నెచింతలపూడిలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అమ్మ ఒడి, నాడు-నేడు, జగనన్న విద్యా కానుక లాంటి పథకాలతో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, గెద్దం సంపదరావు, గోదావరి సెంట్రల్ డెల్టా బోర్డ్ చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కరెళ్ళ రమేష్ బాబు, ఎంపీటీసీ పరమటి నాగమణి, మండల కో ఆప్షన్ సభ్యులు మొసలి స్వర్గన్ రాజు, వైకాపా గ్రామ కమిటీ అధ్యక్షుడు పరమట గోపాలరావు, కుంచే వెంకటేశ్వరరావు, ఏపీఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు

ఉప్పలగుప్తం: వేదాంత, కెయిన్ ఎనర్జీల సహకారంతో మిత్రా హోలిస్టిక్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను అందజేశారు. సోమవారం మండలంలోని ఎస్.యానాం పీహెచ్‌సీలో వైద్యాధికారులు బి.లోవసుధ, జి.ఢిల్లీప్రసాద్‌లు గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల శిశువు ఆరోగ్యంగా పెరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బీర బాలరాజు, డి.మాణిక్యం, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కాట్రేనికోన: బిడ్డ ఆరోగ్యంగా పుట్టాలన్నా, సుఖప్రసవం కావాలన్నా గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పల్లంకుర్రు పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్.గౌతమి అన్నారు. సోమవారం పల్లంకుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద 36 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు గౌతమి మాట్లాడుతూ శిశువు ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో తోడ్పడతాయని, బిడ్డలకు తల్లులు పాలు ఇవ్వాలని సూచించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై వర్క్‌షాపు

అమలాపురం టౌన్: స్థానిక విద్యానిధి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై కెరీర్ సెమినార్ వర్క్‌షాపు సోమవారం జరిగింది. వ్యక్తిత్వ వికాస నిపుణుడు క్రాంత్ పట్నాయిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్ షాపులో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అంశాల వారీగా అవగాహన కల్పించారు. ఈ స్కిల్స్‌లో నైపుణ్యం సాధిస్తే వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎదిగేందుకు చక్కటి అవకాశాలు లభిస్తాయని వివరించారు. కరోనా వైరస్ తర్వాత చాలా మంది ఉద్యోగం, కేరీర్ విషయంలో మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. ఉద్యోగ సంపాదనలో కమ్యూనికేషన్ స్కిల్స్ కీలక భూమిక పోషిస్తాయని చెప్పారు. వర్క్ షాపు విద్యా నిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు అధ్యక్షతన జరిగింది.

సెర్ప్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలంటూ వినతి



ఎంపీ మిథున్ రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

అమలాపురం రూరల్: డీఆర్‌డీఏలో పనిచేస్తున్న పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఉద్యోగులను క్రమబద్ధీకరించి పే స్కేల్ ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ ఎంపీ మిథున్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌లకు సెర్ప్ ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. అమలాపురం పర్యటనకు వచ్చిన మిథున్ రెడ్డిని కాకినాడ, కోనసీమ జిల్లాల ఉద్యోగుల సంఘం నాయకులు సురేష్‌కుమార్, ఫిరంగి శ్రీధర్, కామేష్, వెంకటలక్ష్మిలు కలిసి తమ సమ్యలను విన్నవించుకున్నారు.

రంగరాజుకోడు తవ్వకాల పరిశీలన

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం మేజర్ డ్రెయిన్ నుంచి నంగవరం గ్రామం శివారు వరకూ 6.2 కిలోమీటర్ల మేర జరుగుతున్న రంగరాజుకోడు మీడియం డ్రెయిన్ పనులను డ్రెయిన్స్ డీఈ ఎంవీవీ కిషోర్ సోమవారం పరిశీలించారు. ఈ డ్రెయిన్ పూడికతీత పనుల్లో భాగంగా కాలువకు ఇరువైపులా ఆక్రమించిన భూముల్లో రైతులు కొబ్బరి, అరటి చెట్లను నాటడంతో తొలుత వాటిని తొలగిస్తున్నారు. డీఈ కిషోర్ క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి పనికి ఆటంకం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ సునీతా దేవి, వైఎస్సార్ హార్టీకల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, రైతులు మారిశెట్టి పుండరీకాక్షుడు, యాళ్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక వితరణ

ఉప్పలగుప్తం: ఇటీవల మృతి చెందిన ఉప్పలగుప్తం గ్రామ పంచాయతీ పరిధి మధురపేటకు చెందిన చేపల వ్యాపారి మధుర కృష్ణమూర్తి కుటుంబానికి రూ.20 వేల నగదును స్థానిక సర్పంచ్ కడిమి చిన్నవరాజు చేతుల మీదుగా కోనసీమ చేపల వర్తక సంఘం సభ్యులు సోమవారం అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ధర్మాడి ఏడుకొండలు, రాణి సత్తిబాబు, కొప్పిశెట్టి వెంకట రమణ, కొప్పాడ శ్రీనివాసరావు, మల్లాడి పుల్లయ్య పాల్గొన్నారు.

ఎల్‌పీజీ గ్యాస్ సిలెండర్లకు సబ్సిడీ

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ నాలుగు రీజియన్‌ల్లోనూ చీఫ్ మినిస్టర్ స్కీం ఫర్ గ్రాంట్ ఆఫ్ సబ్సిడీ పథకం ద్వారా రేషన్ కార్డుదారులకు ఎల్‌పీజీ గ్యాస్ సిలెండర్లకు సబ్సిడీ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం సోమవారం జీఓను విడుదల చేసింది. ఎరుపు కార్డుదారులకు 14.2 కేజీల ఎల్‌పీజీ సిలెండర్‌కు నెలకు రూ.300 సబ్సిడీ, పసుపు కార్డుదారులకు నెలకు రూ.150 సబ్సిడీ ఇవ్వనున్నారు.

గుడ్ మార్నింగ్ 'ముమ్మిడివరం'



ప్రభుత్వ వసతి గృహంలో మౌలిక వసతులు పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: గుడ్ మార్నింగ్ 'ముమ్మిడివరం' కార్యక్రమంలో ప్రజా సమస్యలపై నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ స్పందించారు. నగర పంచాయతీ 17వ వార్డులో కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్‌తో కలిసి సోమవారం ఆయన గుడ్ మార్నింగ్ ముమ్మిడివరం కార్యక్రమం నిర్వహించారు. మంచినీటి చెరువు చుట్టుపక్కల ఉన్న పరిసరాలను పరిశీలించి అక్కడ ప్రజల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక వసతి గృహాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి వారి విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులపై విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట కోఆప్షన్ సభ్యుడు అలీ, కోన వెంకట శ్రీనివాసరావు, మట్టపర్తి శ్రీనివాసరావు, మునుకోటి వాసు తదితరులున్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు



జాబ్‌మేళాలో పాల్గొన్న ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు మెరుగ్గా లభిస్తాయని ఆర్‌ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో జరిగిన జాబ్‌మేళా సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి స్థాయిలోనే ఉపాధి మార్గాలను చూపించే కోర్సులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. జాబ్‌మేళాలో ఆవిష్కార్ ఇంజినీర్ సంస్థ, ప్రీమియర్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థలు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 42 మంది ఐటీఐ విద్యార్థులు, డిప్లమా నుంచి ముగ్గురు, 8 మంది బీటెక్ విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. కార్యక్రమంలో ఎస్పీ రఘునాయగం, కంపెనీల హెచ్‌ఆర్‌లు జానీబాషా, జి.కమల్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణసుధాకర్, వాసంశెట్టి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా సాగుపై అవగాహన పెంచుకోవాలి



ఉప్పలగుప్తంలో రైతులతో మాట్లాడుతున్న జేడీ లాల్ మహ్మద్

ఉప్పలగుప్తం: రైతులు ఆక్వా సాగుపై అవగాహన పెంచుకోవాలని జిల్లా మత్స్య శాఖాధికారి ఎస్‌కే లాల్ మహ్మద్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తంలో మహిళా సమాఖ్య కార్యాలయంలో స్థానిక ఆక్వా రైతులతో మత్స్య శాఖాధికారులు నిర్వహించిన సమావేశానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో పలువురు రైతులు రొయ్య రేటు బాగా తక్కువగా కొంటున్నారని, విద్యుత్ రాయితీలు అందటం లేదని జేడీ లాల్ మహ్మద్ దృష్టికి తీసుకొచ్చారు. రొయ్యకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించిందని, దళారీల నుంచి బిల్లు రశీదు తీసుకోగలిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీడీ సీహెచ్ శ్రీనివాసరావు, ఏడీ ఎల్‌బీఎస్ వర్ధన్, ఎఫ్‌డీవోలు ఎస్.నాగమణి, అశ్వని సత్య, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోపరేటివ్ సిబ్బంది ఆందోళన బాట

యానాం: యానాం కోపరేటివ్ స్టోర్స్‌లో విధులు నిర్వహిస్తున్న 85 మంది సిబ్బందికి గత 30 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తామంతా మంగళవారం నుంచి విధులు బహిష్కరించి ఆందోళన బాట పట్టనున్నట్లు కోపరేటివ్ స్టోర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు పువ్వల శ్రీను తదితరులు సోమవారం తెలిపారు. తమ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని, ఆదుకోవాలని అధికారులను ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో స్థానిక ఆర్‌ఏఓ ఆఫీసు సమీపంలో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు.

సాగు నీరందించాలని రైతుల వినతి

తాళ్లరేవు: కాలువలకు సాగునీటిని పూర్తిస్థాయిలో అందించాలని పలువురు రైతులు తహసీల్దార్ ఎస్.పోతురాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కోరంగి కాంగ్రెస్ కెనాల్ నుంచి సీతారామపురం పెట్రోల్ బంకు పక్కన ఉన్న వన్‌బైటు కెనాల్‌కు సాగునీరు పూర్తిస్థాయిలో రాకపోవడంతో తాము ఇప్పటివరకూ నారుమళ్లు వేయలేకపోయామన్నారు. ఈ ప్రాంతానికి సాగునీటి సమస్య కారణంగా భూములు బీడుగా మారే ప్రమాదం ఉందన్నారు.

టీడీపీ బస్సు యాత్ర

ముమ్మిడివరం: టీడీపీ నిర్వహిస్తున్న బస్సు యాత్ర సోమవారం సాయంత్రం యానాం-ఎదుర్లంక వారధి నుంచి మురమళ్ల, కొమానపల్లి మీదుగా ముమ్మిడివరం చేరుకుంది. ముమ్మిడివరం టీడీపీ కల్యాణ మండపంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాట్ల బుచ్చిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పలు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ టీడీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు.